ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## 21న మోడీ అధ్యక్షతన
# ఆల్ పార్టీ మీటింగ్
### లోక్‌సభ సమావేశాలపై చర్చ

న్యూఢిల్లీ, జులై 16 (ప్రభాత ఉదయం): 22 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2024-2025 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రధాని మోడీ అధ్యక్షతన ఆర్థిక వేత్తలు, నీతి అయోగ్ అధికారులతో భేటీ అయి బడ్జెట్ కూర్పుపై సూచలు, సలహాలు స్వీకరించారు. ఇదిలా ఉంటే ఈనెల 21న అఖిలపక్ష సమావేశానికి రావాల్సిందిగా అన్ని పార్టీలకు కేంద్రం ఆహ్వానాలు పంపింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు.. పార్టీ ఫ్లోర్ లీడర్లకు ఆహ్వానాలు పంపారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

సంపుటి: 2 | సంచిక: 97 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 17 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## రైతు రుణమాఫీకి
# ముహూర్తం ఖరారు
### జులై 18 నుంచి రుణమాఫీ అమలు ప్రక్రియ ప్రారంభం
### మొదట రైతుల అకౌంట్లలో లక్ష జమ చేయనున్న ప్రభుత్వం



## కలెక్టర్లు క్షేత్రస్థాయిలో
# పర్యటించాల్సిందే
### మీరు ప్రభుత్వానికి కళ్లు, చెవులులాంటి వారు
### కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్

2

హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఎగిరిగంతేసే వార్త వినిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 2 లక్షల మేర రుణమాఫీ చేసేందుకు గానూ.. సోమవారం రోజున పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం.. నేడు మరో శుభవార్త వినిపించింది. రుణమాఫీ అమలుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి రుణమాఫీ ప్రక్రియను మొదలుపెట్టనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు రుణమాఫీకి రేషన్ కార్డే ప్రామాణికమని మార్గదర్శకాల్లో పేర్కొనగా.. రైతుల్లో ఏర్పడిన గందరగోళానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు క్లారిటీ ఇచ్చారు. అర్హులైన రైతులకు రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. రేషన్ కార్డు అనేది కేవలం రైతు కుటుంబ నిర్ధారణ కోసమేనని స్పష్టం చేశారు. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేస్తామని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో మొత్తం రుణమాఫీ లబ్ధిదారులు 40 లక్షల మంది ఉన్నారని.. అందులో కేవలం 6 లక్షల మందికి ..మిగతా 2లో




## రేషన్ కార్డు లేకుండానే
# ఆరోగ్యశ్రీ సేవలు
### రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): తెలంగాణలో అవసరం ఉన్న అందరికీ ఆరోగ్య శ్రీసేవలు అందేలా చూడాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేవలం రేషన్ కార్డు ఉన్న వాళ్లకే ఆరోగ్యశ్రీ సేవలు అందించొద్దని అందరికీ సేవలు అందుబాటులో ఉంటారన్నారు. ఆరోగ్య శాఖపై సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలో రేషన్ కార్డు లేకపోయినా సరే ఆరోగ్యశ్రీ సేవలు అందాలని ఆ దిశగా విధి విధానాలు రూపొందించాలని సూచించారు రేవంత్ రెడ్డి. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దన్నారు. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని... ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై అధ్యయనం చేసి కొత్త జీవో విడుదల చేయాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు సీఎం. రూరల్ ఏరియాలో పనిచేసే వైద్యులకు పారితోషకం ఎక్కువ అందించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కూడా చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్‌కు ఒక సీరియల్ నెంబర్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. హాస్పిటల్స్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండేలా చూడాలన్నారు.

**అన్నింటికీ ఇదే సూత్రం**

**వర్తింపజేయాలి: హరీష్**

ఆరోగ్య శ్రీకి రేషన్ కార్డుతో పని లేకుండా చేసిన సీఎం మిగతా వాటికి కూడా ఇదే సూత్రం వర్తింప జేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతు రుణమాఫీకి కూడా రేషన్ కార్డు ఇతర పత్రాలు లేకుండానే ఇవ్వాలని సూచించారు. రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని అన్నారు.



## ప్రభుత్వం ఒకేసారి
# రుణమాఫీ చేయాలి
### రాజేంద్రనగర్ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి
### రుణమాఫీ నిబంధనలే రైతుకు ఉరితాడుగా మారింది
#### అధికారం చేపట్టి ఏడు నెలలు కాకముందే ఏడు రకాల దిబ్బలు పెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



రాజేంద్రనగర్,జులై 16(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి ప్రభుత్వం నిబంధనల పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తోందని రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటగా రైతు సాయం,రైతు భరోసా వేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్ సర్కార్ విధి విధానాలు అభిప్రాయ సేకరణ అంటూ కాలయాపన చేస్తున్నారని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు.మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. అలివి కాని 6 గ్యారంటీలు ఆమె ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజలను నిబంధనల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు.మొదట చెప్పిన విధంగా అర్హులైన రైతులకు వెంటనే రైతు భరోసా,అలాగే ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేయాలన్నారు.రుణమాఫీ నిబంధనలే రైతుకు ఉరితాడుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.దరఖాస్తులు తీసుకొని 7 నెలలైనా రేషన్‌కార్డులు ఇవ్వని ముఖ్యమంత్రి రుణమాఫీ కావాలంటే తెల్లరేషన్ కార్డు ఉండాలని నిబంధనలు పెట్టాడం ఏంటని ప్రశ్నించారు.కేసీఆర్‌ను ఓడించాలని అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడు నెలలు కాకముందే ఏడు రకాల తిప్పలు పెడుతుందని ధ్వజమెత్తారు.విశ్వసనీయత లేని ప్రభుత్వమనే కేసీఆర్‌కు బొంద పెట్టారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని ..మిగతా 2లో

## తీహార్ జైల్లో
# కవితకు అస్వస్థత
### ఆస్పత్రికి తరలింపు



హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ పార్టీ నేత, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురయ్యారు. ఆమె ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణల కారణంగా ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో తీహార్ జైలు అధికారులు ..మిగతా 2లో



2

### రుణమాఫీ నిబంధనలే
# రైతులకు ఉరితాడు
### సగం మందిని మాఫీ చేసే కుట్ర: ఈటల రాజేందర్

# హల్వా వేడుకలో పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలమ్మ



న్యూఢిల్లీ, జులై 16 (ప్రభాత ఉదయం): కేంద్ర బడ్జెట్ సందర్భంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించే హల్వా వేడుక ఢిల్లీలో జరిగింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో మంగళవారం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్-2024-25 ప్రక్రియ చివరి దశకు రావడంతో జరిగిన ఈ హల్వా తయారీ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయంగా నిర్మలమ్మ.. ఆర్థిక శాఖ కార్యదర్శులు, అధికారులు, సిబ్బందికి హల్వా పంచారు. ఈ కార్యక్రమలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, సీనియర్ సెక్రటరీలు పాల్గొన్నారు. హల్వా ఆచారం దశాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్నారు. ముఖ్యమైన లేదా ప్రత్యేకమైనదాన్ని ప్రారంభించే ముందు ఏదైనా తీపిని తినడం భారతీయ సంప్రదాయం. దాని నుంచే ఈ హల్వా ప్రేరణ ..మిగతా 2లో

# రైతు రుణమాఫీకి ముహూర్తం ఖరారు

మొదటి పేజీ తరువాయి...

మాత్రమే రేషన్ కార్డులు లేవని మంత్రి పేర్కొన్నారు. రుణమాఫీ పథకం పూర్తిగా అమలు చేసేందుకు మొత్తం రూ.31 వేల కోట్లు అవసరమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ నెల 18 తేదీ నుంచి రుణమాఫీ ప్రక్రియ మొదలు పెట్టి విడతల వారీగా ఆగస్ట్ 15ల తేదీలోపు మొత్తం ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అయితే.. 18 రోజున లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయనున్నట్టు వెల్లడించారు. దీంతో... ఒక్కో రైతు అకౌంట్లో 18 వ తేదీన లక్ష రూపాయలు జమకానున్నాయి. తెలంగాణ సచివాలయంలో కలెక్టర్లతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు మాత్రమే రేషన్ కార్డు ఉపయోగించనున్నట్టు స్పష్టం చేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణమాఫీ పథకం అమలవుతుందని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు.. ఈ నెల 18న లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జూలై 18 తేదీన సాయంత్రంలోగా రైతుల రుణఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.. అదే రోజు రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబరాలు కూడా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

## కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే




ప్రభుత్వాలకు కళ్లు, చెవులు కలెక్టర్లేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీల సదస్సు నిర్వహించగా.. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, హెల్త్, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, ఎడ్యుకేషన్, లా అండ్ ఆర్డర్, భద్రతా సంబంధిత సమస్యలు, యాంటి డ్రగ్ క్యాంపెయిన్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పారదర్శకంగా కలెక్టర్ల బదిలీలు నిర్వహించామని చెప్పారు. ఒక శంకరన్, ఒక శ్రీధరన్ లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. 'డిసెంబర్ 24, 2023న కలెక్టర్లతో మొదటిసారి సమావేశం నిర్వహించాం. ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని ఆ సమావేశంలో ఆదేశించాం. ఎన్నికల కోడ్ ముగియగానే పారదర్శకంగా కలెక్టర్ల బదిలీలు నిర్వహించాం. ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే.. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఉన్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే మీరు ప్రజలకు సరైన సేవలు అందించగలుగుతారు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలి. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో మీ నిర్ణయాలు ఉండాలి. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా ఎలాంటి సంతృప్తి ఉండదు. మీ ప్రతీ చర్య ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు తెలిసేలా ఉండాలి. ఈ ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలన అందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉంది. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే.. ప్రతీ పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతీ నెలా రూ.85 వేలు ఖర్చు పెడుతోంది. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకం. విద్యావ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుడిలా స్పందించారు. కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా మీ పనితనం ఉండాలి. ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత మీపైనే ఉంది. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు విశ్వాసం కల్పించాలి.' అని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.



## పవర్ కమిషన్ చైర్మన్‌ను మార్చండి

### కేసీఆర్ పిటిషన్‌పై సీజేఐ కీలక ఆదేశాలు

హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): చత్తీస్‌గడ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు..భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలంటూ బీఆరెస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని ఆదేశించారు. కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ పెట్టడాన్ని చంద్రచూడ్ తప్పు పట్టారు. విచారణ కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ ఎలా పెడతారని, విచారణ అంశాలు బయటకు ఎలా వ్యక్తం చేస్తారని ప్రశ్నించారు. న్యాయమూర్తి న్యాయం చెప్పడమే కాకుండా నిష్పక్షపాతంగా కనబడాలని, కమిషన్ చైర్మన్‌గా మరో జడ్జిని నియమించాలని తెలంగాణ ప్రభుత్వానికి సీజేఐ సూచించారు. లంచ్ తర్వాత రెండు గంటల కల్లా కొత్తగా ఎవరిని నియమిస్తారో చెప్పాలని స్పష్టం చేశారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తరుపు న్యాయవాది అభిషేక్ సంఘ్వీ తాము చైర్మన్ మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు నివేదించారు. కేసీఆర్ తరుపునా న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. విద్యుత్తు కమిషన్ ఏర్పాటు, చైర్మన్ నరసింహారెడ్డి తీరు నిష్పక్షపాతంగా లేదని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కమిషన్ ఏర్పాటు చేశారని, చైర్మన్ నరసింహారెడ్డి విచారణ శైలి, ప్రెస్‌మీట్ అంతా ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఉందని, కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు కమిషన్ చైర్మన్‌ను మార్చాలని స్పష్టం చేసింది. భోజన విరామం తర్వాత తదుపరి విచారణ కొనసాగిస్తామని తెలిపింది. చైర్మన్ మార్చాలన్న సుప్రీంకోర్టు నిర్ణయంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విద్యుత్తు కమిషన్ అంశంలో ఎదురుదెబ్బ తగిలింది. తక్షణమే రంగంలోకి దిగిన సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ల సదస్సు మధ్యలోనే బయటకు వెళ్లి సుప్రీంకోర్టులో విద్యుత్తు కమిషన్‌పై జరిగిన వాదోపవాదాలు, సీజేఐ ఆదేశాలపై ఏజీ సుదర్శన్‌రెడ్డి ద్వారా తెలుసుకున్నారు. కమిషన్ చైర్మన్‌గా ఉన్న ప్రస్తుత జడ్జి ఎల్. నరసింహారెడ్డి స్థానంలో నియమించబడే మరో జడ్జి ఎంపికపై నిపుణులతో సంప్రదింపులు చేపట్టారు.

#### విచారణ బాధ్యతల నుంచి తప్పుకున్న నరసింహారెడ్డి

భోజన విరామ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. విద్యుత్తు కమిషన్ విచారణ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లుగా జస్టిస్ నరసింహారెడ్డి ఓ న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టుకు లేఖ పంపించారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి సుప్రీంకోర్టు సమయమిచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ మేరకే కొత్త జడ్జిని నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. జ్యుడీషియల్ విచారణ అనకుండా.. ఎంక్వైరీ కమిషన్ గా వ్యవహరించాలని సుప్రీం ధర్మాసనం సూచించింది.

#### సోమవారం కొత్త చైర్మన్‌ను నియమిస్తామన్న ప్రభుత్వం

సోమవారంలోపు నూతన చైర్మన్‌ను నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. అనంతరం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. కేసీఆర్ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. రోహత్గీ తన వాదనలో విద్యుత్తు విచారణ కమిషన్ నియామకంలో పరిధిని అతిక్రమించారని, ట్రిబ్యునల్స్ ఉండగా, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై ఎలా న్యాయ విచారణ ఎలా వేస్తారని ప్రశ్నించారు. నూతన జడ్జిని నియమించిన పక్షంలో కొత్తగా వచ్చే చైర్మన్ సారధ్యంలోని కమిషన్ ముందు కేసీఆర్ హాజరవుతారా లేదో వేచి చూడాల్సివుంది.



## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కు పిటీషన్ ఇచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్ జులై 16 (ప్రభాత ఉదయం): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో స్పీకర్ కు పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ పాటించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరారు. అదేవిధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హతవేటు వేయాలని ఎమ్మెల్యేలు స్పీకర్ కు పిటీషన్ ఇచ్చారు. అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్ ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. మూడు నెలల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని సూచనలు ఉన్నాయని, అన్ని అంశాలను వివరిస్తూ స్పీకర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మణిపూర్ లో పార్టీ మారిన ఎమ్మెల్యేపై తీసుకున్న నిర్ణయాన్ని మేము ప్రస్తావించామని, జనవరి 2020లో మణిపూర్ ఎమ్మెల్యే అనర్హతపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ కు పిటిషన్ ఇచ్చామని తెలిపారు. హర్యానాలో పార్టీ మారిన కాంగ్రెస్ ఎమ్మెల్యే పై అనర్హత వేటువేయాలని కాంగ్రెస్ కోరుతుంది. పార్టీ ఫిరాయింపులు తనకు ఇష్టం లేదని స్పీకర్ ఇంటర్వ్యూలో చెప్పారు. దీన్ని మేము స్వాగతిస్తున్నాం. స్పీకర్ పై మాకు పూర్తి విశ్వాసం ఉంది. సరియైన నిర్ణయం స్పీకర్ తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళతామని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు ఫోన్ చేసి పార్టీ మారకపోతే ప్రాణగండం ఉందని హెచ్చరించారు. ఇది దారుణమైన విషయం. ఎమ్మెల్యేల సొంత వ్యాపారాలపై దాడులు జరుగుతున్నాయి. బడే బాయ్, చోటే బాయ్ కి తేడా లేదు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డిలు పార్టీ మారకపోతే ప్రజా ప్రతి నిధులను వేధిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మాకు సానుభూతి ఉందన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని చెప్పిన కడియం శ్రీహరి ముందుగా కాంగ్రెస్ పార్టీలో చేరారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలి

మొదటి పేజీ తరువాయి...

అహంకారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.అధికారం చేపట్టి ఏడు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి ఏడు రకాల తిప్పలు పెడుతున్నారని తోకల శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు. రైతుల శాపనార్థలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగలడం ఖాయమన్నారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్ళినప్పుడు ఎంతకు అమ్ముడుపోయారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తు చేశారు.తాజాగా పార్టీ ఫిరాయింపుల విషయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ జుట్టులోకెళ్లి వచ్చాడని విమర్శించారు.పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతు రుణమాఫీ,రైతు బంధు,బోనస్ ఇవ్వడం మీద లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హల్వా వేడుకలో పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలమ్మ

మొదటి పేజీ తరువాయి...

పొందింది. బడ్జెట్‌ను తయారు చేయడంలో పాల్గొన్న వారందరి ప్రయత్నాలను గుర్తించేందుకు ఇది ఒక గుర్తుగా ఉంటుంది. ఇక బడ్జెట్ డాక్యుమెంట్ల ప్రింటింగ్ 1980 నుంచి నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో తయారవుతోంది. బడ్జెట్ వివరాలు బయటకు రాకుండా అందరూ అక్కడే కొద్ది రోజుల పాటు ఉండేలా చేస్తారు. మొబైల్స్ ఫోన్స్‌కు కూడా అనుమతి ఉండదు. ఇక పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జూలై 22 నుంచి ఆగస్టు 12 వరకూ జరగనుండగా, జూలై 23న పూర్తి బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెడుతున్న ఆరవ బడ్జెట్ ఇది.



### రుణమాఫీ నిబంధనలే

## రైతులకు ఉరితాడు

### సగం మందిని మాఫీ చేసే కుట్ర: ఈటల రాజేందర్

హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రైతుల రుణమాఫీ అంశంపై రాజకీయాలు జరుగుతున్నాయి. రైతులకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంటే, రుణమాఫీ మార్గదర్శకాలు లబ్ధిదారులను తగ్గిస్తాయని, సగం మంది రైతులకు అన్యాయం జరుగుతుందని ప్రతిపక్ష బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. రైతు రుణమాఫీ నిబంధనలు రైతులపాలిట ఉరితాడుగా మారతాయంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎలాగైనా ఓడించాలని కాంగ్రెస్ నేతలు అడ్డగోలు హామీలు ఇచ్చారన్నారు.

#### కేసీఆర్‌ను ఓడించేందుకు అడ్డగోలుగా హామీలు

'ఎన్నికల సమయంలో బహిరంగ సభల్లో కిసాన్, యువ, దళిత పాలసీలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీకి 6 పేజీల నిబంధనలు (రుణమాఫీ మార్గదర్శకాలు) రూపొందించింది. రుణమాఫీ జరగాలంటే తెల్లరేషన్ కార్డు తప్పనిసరి చేస్తూ నిబంధన పెట్టారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మరోసారి మోసగించింది.

#### పదేళ్లుగా తెల్లరేషన్ కార్డులు జారీ చేయలేదు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేళ్ల నుంచి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయలేదు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, రేషన్‌కార్డు దరఖాస్తులు తీసుకొని 7 నెలలయినా ఒక్కరికీ కూడా మంజూరు చేయలేదు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అడ్డదారులు తొక్కి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో విశ్వసనీయత లేని నేత అంటూ కేసీఆర్‌ను సీఎం పీఠానికి దూరం చేశారు. కానీ తనకు ఐదేళ్ల అధికారం ఉందని, ఏమైనా చేయవచ్చు అన్నట్లు రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నారు. రైతుల పక్షాన నిలిచింది బీజేపీ. అందుకే మద్దతు ధరలను ఎన్డీఏ ప్రభుత్వం రెట్టింపు చేసింది. మేం నిబంధనలు ప్రకారం దేశవ్యాప్తంగా కిసాన్ సమ్మాన్ నిధి ఇస్తున్నాం. కానీ కాంగ్రెస్ రేషన్ కార్డ్ తప్పనిసరి లాంటి నిబంధనలు, ఇంటికి రూ.2 లక్షల రుణమాఫీ అంటూ సగం మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతుందని' ఈటల రాజేందర్ ఆరోపించారు.

#### ఆకలిని భరిస్తారు, కానీ అవమానాల్ని కాదు

'రైతులకు కిసాన్ సమ్మాన్ నిధితో ప్రయోజనం చేకూర్చాం. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఆరు పేజీల నియమ నిబంధనల అవసరం ఏముంది. ఏ కండీషన్ లేకుండా అర్హులైన అందరికీ రుణాలు మాఫీ చేయాలి. నిజాలు చెబితే ప్రజలు నమ్మరని, వాళ్లు నిజాలు నమ్మాలనుకోవడం లేదని రేవంత్ రెడ్డి చెప్పిన మాటల క్లిప్ ప్రదర్శించారు. రాజకీయ పార్టీలు, నేతలు ప్రజల్ని మోసం చేయాలని చూస్తారట. కానీ కేసీఆర్ లాంటి నేతను గద్దె దింపడానికి ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించారు. అంతే కానీ హస్తం పార్టీపై ప్రేమతో కాదు. నాకు తెలిసి తెలంగాణ ప్రజలు ఆకలిని భరిస్తారు. కానీ అవమానాన్ని మాత్రం భరించలేరు. ధర్మం తాత్కాలికంగా ఓడిపోవచ్చు. నీతి, నిజాయితీనే వాళ్లు కోరుకుంటారు. మోసపూరిత హామీలు నమ్మి కాంగ్రెస కు ఓట్లు వేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడటం ఖాయమని' బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## తీహార్ జైల్లో కవితకు అస్వస్థత

మొదటి పేజీ తరువాయి...

ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు తెలిసింది. ఆమెను దీన్ దయాల్ ఆస్పత్రికి తరలించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు కవితపై ఉన్న సంగతి తెలిసిందే. దాదాపు ఐదు నెలల నుంచి కవిత జైలులో ఉండగా.. ఆమె బెయిల్ పిటిషన్లను కోర్టులు తోసిపుచ్చుతూ ఉన్నాయి. ప్రస్తుతం సీబీఐ, ఈడీ వేర్వేరు కేసులు నమోదు చేయగా.. ఆ రెండు కేసుల్లోనూ కవిత అరెస్టు అయ్యారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత తొలిసారిగా మార్చి 15న హైదరాబాద్ లో అరెస్ట్ అయ్యారు. ఈడీ ఈ అరెస్టు చేసింది. అనంతరం కవితను ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అయిన రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అప్పటికే ఒకసారి అరెస్టు అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను.. ఏప్రిల్ 11న మరోసారి సీబీఐ ఇదే కేసులో అరెస్టు చేసింది. తొలుత ఈడీ కవితను అరెస్టు చేయగా.. తీహార్ జైలులో ఉన్న కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. అయితే, ఈ అరెస్టులపై కవిత తొలి నుంచి న్యాయస్థానంలో పోరాడుతున్నారు. ఎన్నోసార్లు బెయిల్ కోసం ప్రయత్నిస్తూ పిటిషన్లు వేశారు. ప్రతిసారి అక్కడ ఆమెకు చుక్కెదురు అవుతూనే ఉంది.

## తెలుగు రాష్ట్రాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు

హైదరాబాద్, జులై 16 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ వాతావరణ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అల్పపీడన ప్రాంతం ఒకటి దక్షిణ ఒడిశా తీరం వద్ద వాయువ్య, దాని పరిసర పశ్చిమ – మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 7.6 కి. మీ. ఎత్తు వరకు ఏర్పడింది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశ వైపు వంగి ఉన్నది. ఋతుపవన ద్రోణి జైసాల్మయిర్, కోట, సంబల్పూర్, పూరి గుండా వెళుతూ, వాయువ్య, పరిసర పశ్చిమ – మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై వున్న అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కొనసాగుతున్నది. గాలి విచ్ఛిన్నతి 20 డిగ్రీల ఉత్తర అక్షాంశం గుండా సగటు సముద్ర మట్టానికి 3.1 కి. మీ. నుండి 7.6 కి. మీ ఎత్తు మధ్యలో కొనసాగుతూ ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉన్నది. మరొక అల్పపీడన ప్రాంతం జులై 19 తేదీన పశ్చిమ – మధ్య, దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం వుంది. గంగేటిక్ పశ్చిమ బెంగాల్ దానిని ఆనుకొని వున్న ఝూరండ్, ఒడిశా ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి. మీ. ఎత్తులో కేంద్రీకృతమై వున్న ఆవర్తనం ఈరోజు బలహీనపడింది.

తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు అక్కడ అక్కడ కురిసే అవకాశం వుంది. రేపు రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు అక్కడ అక్కడ కురిసే అవకాశం వుంది. ఈరోజు, రేపు, రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ. వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడ అక్కడ కురిసే వర్షాలు అవకాశం వుంది. జూలై 18న తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు తెలియజేశారు. ఆరోజు ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేశారు. హైదరాబాద్ లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిసార్లు మెరుపులు, ఈదురుగాలులతో 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో సంభవించే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28 డిగ్రీలు, 23 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు నైరుతి దిశలో వీచే అవకాశం ఉంది. గాలి వేగం గంటకు 8 – 12 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ – దక్షిణ దిశలో వీచే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 29.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.6 డిగ్రీలుగా నమోదైంది. 62.5 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది.



# ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కరించాలి

**రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి కి వినతి పత్రం అందజేసిన అమరచింత మండలం వి ఓఏల సంఘం ప్రతినిధులు**



వివోఏలు తమ సమస్యలపై ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

హైదరాబాద్,జూలై16(ప్రభాత ఉదయం) ఐకెపిలో పనిచేస్తున్న విలేజి ఆర్గనైజేషన్ అసిస్టెంట్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగ సంఘం వనపర్తి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. మంగళవారం హైదరాబాదులోని ప్రజా భవన్ లో వివో ఏ వనపర్తి జిల్లా కమిటీ తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ జి చిన్నారెడ్డి ని కలిసి వివో ఏ ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల సమాఖ్య లు విధులు నిర్వహిస్తున్న కార్యనిర్వాహక సహాయకులు (వివో ఏ) ప్రతి గ్రామంలో సమాఖ్య సంఘాలు ఉన్నాయి. ప్రతి గ్రామాఖ్య సంఘాలకు విలేజి ఆర్గనైజేషన్ అసిస్టెంట్ లు గా పనిచేస్తున్నాము. తాము 20 సంవత్సరాల గా సంఘాలను తయారు చేస్తూ ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రతి పేద మహిళలకు సమాచారము చేరవేస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయుటకు కృషి చేస్తున్నాము. గ్రామస్థాయిలో జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో వి.ఓ.ఎ.లు పాల్గొని విజయవంతం చేస్తున్నాము. స్వయం సహాయక సంఘాలకు సమావేశాలకు నిర్వహిస్తూ మహిళలు ఖలిగా వున్న సమయంలో వారి ఇంటి దగ్గరకు వెళ్ళి సమావేశాలు నిర్వహిస్తూ అన్ని విషయాలు పూర్తిగా వివరించి లైవ్మీటింగ్లు ఆన్లైన్లో చేస్తున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. మహిళా సమాఖ్య లావాదేవీలు పుస్తక నిర్వహణ చేస్తూ వాటిని ఆన్లైన్లో ఎంట్రీ చేస్తూ స్వయం సహాయక సంఘాలు, వి.ఓ.లకు గ్రేడింగ్ వచ్చేలా చేస్తున్నామన్నారు. ప్రతి మహిళ ఒక వ్యాపారవేత్తగా ఎదుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. తాము నిర్వహిస్తున్న విధులకు వేతనం ప్రభుత్వం చాలా తక్కువ ఇస్తుందన్నారు. ఒకప్పుడు గౌరవ వేతనం లేకుండానే పనులు చేస్తూ వచ్చాము. మన కాంగ్రెస్ ప్రభుత్వంలో మమ్ములను మా కృష్టాలను గుర్తించి రూ.3000/- వేతనంగా ఇచ్చారు. గత ప్రభుత్వములో ఇన్ని పనులు చేసినా మాకు కేవలం 900 లను మాత్రమే పెంచుతూ 3900/- నుండి 5000/- వరకు పెంచడం జరిగిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వీ ఎ వో ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని సంఘం ప్రతినిధులు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డిని కోరారు.



మూసి లో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్

## డ్రోన్‌ల సహకారంతో మూసిలో యాంటీ లార్వా ఆపరేషన్

**సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్**

**క్రేన్ సహాయంతో గుర్రపు డెక్క ను తొలగిస్తాం : ఈ ఈ నరేందర్ గౌడ్**

బుద్వేల్, జూలై16(ప్రభాత ఉదయం): మూసీ నదిలో డ్రోన్ల సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తామని గ్రేటర్ దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ తెలిపారు. అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్ , బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కోమరయ్య, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్ లు గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న దృష్టికి మూసిలో గుర్రపు డెక్క పెరగడం వల్ల దోమలు విపరీతంగా అభివృద్ధి చెంది స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో వెంకన్న సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఈఈ నరేందర్ గౌడ్ లను పంపించి మూసీ లో గుర్రపు డెక్క ను తొలగించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశీలన చేసి అంచనాలు తయారు చేయమని ఆదేశించారు. దీంతో నామల శ్రీనివాస్ , నరేందర్ గౌడ్ లు తమ సిబ్బందితో కలిసి మూసీ నదిలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను పరిశీలించారు. గుర్రపు డెక్క తొలగించడానికి అంచనాలు సిద్ధం చేసి త్వరలోనే గుర్రపు డెక్క ను తొలగిస్తామని తెలిపారు. నామాల శ్రీనివాస్ మాట్లాడుతూ గుర్రపు డెక్క ఉన్న ప్రాంతంలో డ్రోన్ల సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తామని తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచుదాం

**కేతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి తారాబాయి**

**కేతిరెడ్డిపల్లిలో ఇంటింటికి మొక్కల పంపిణి**

మొయినాబాద్ జూలై 16 (ప్రభాత ఉదయం): పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటింటికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను పెంచాలని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తారాబాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి నర్సరీలో పెంచిన మొక్కలను ఇంటింటికి ఒకే రోజు రెండు వేల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద పెరటి గోడలో, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి చెట్లను పెంచితే కాలుష్య నిర్మూళనకు కృషి చేసిన వారు అవుతామన్నారు. మొక్కలు నాటి చెట్లను పెంచితే మంచి వాతావరణంతో ఆరోగ్యంగా జీవించగలుగుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన వివిధ రకాల మొక్కలు నర్సరీల్లో ఉ న్నాయని కావాల్సినవి తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మధురానగర్‌లో బోనాల వేడుకలకు భారీగా ఏర్పాట్లు

శంషాబాద్, జూలై 16( ప్రభాత ఉదయం)శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని మధురానగర్ లోని పోచమ్మ దేవాలయం వద్ద బోనాల వేడుకలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 21వ తేదీన బోనాల వేడుకలను నిర్వహించనుండడంతో భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు చలివేంద్రి శ్రీకాంత్ రెడ్డి. ముద్దం మల్లారెడ్డి. తోట రాములు ముదిరాజ్.ఆవుల శ్రావణ్ కుమార్. ఈదుల నరసింహ గౌడ్. చేవెళ్ల ప్రసాద్. దమ్మాయిగూడ సంతోష్ రెడ్డి. గోవర్ధన్ రెడ్డి. పవన్ గౌడ్. సామ చెన్నారెడ్డి .జైహింద్ రెడ్డి.మున్నూరు రాజు. గాజుల రాజు. తదితరులు సమావేశాన్ని ఏర్పాటు చేసి దేవాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్ల గురించి సమావేశంలో చర్చించారు.



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

## అమ్మమాట.. అంగన్వాడి బాట ర్యాలీ

రాజేంద్రనగర్,జులై 16(ప్రభాత ఉదయం) మైలార్ దేవులపల్లి సెక్షన్ బాబుల్ రెడ్డినగర్ అంగన్‌వాడి కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం బాబుల్ రెడ్డి నగర్ బస్తీలో అంగన్వాడి టీచర్లు చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ...అంగన్ వాడి కేంద్రంలో రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటాపాటలతో ఆరోగ్యంగా ఉ ండవచ్చున్నారు.ఏళ్లు దాటిన పిల్లలందరికి అక్షరాలు,అంకెలు,ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు.చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు. చిన్నారి పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.రెండున్నరేళ్ల దాటిన పిల్లల పేర్లను ఇంటింటికి తిరిగి నమోదు చేసుకుంటామన్నారు.గర్భిణీలు, బాలింతలు,చంటిపిల్లలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందే సేవల గురించి తెలిపారు.బోధించే విద్య,అందించే సేవల గురించి టీచర్లు..పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలను చేర్పించాలని కోరారు.ఐదేళ్లు పూర్తయి అంగన్‌వాడీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు 'ప్రి స్కూల్ సర్టిఫికెట్'ను అందజేస్తామని తెలిపారు. అవగాహన ర్యాలీలో అంగన్‌వాడి టీచర్లు అనిత,మాధవి,ఏఎన్ఎం ప్రేమాదేవి, సంగీత, రేణుక,సరిత,మంగ,లక్ష్మి ,ఆర్ పి హేమలత తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి ఊర చెరువు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

**సిపిఎం మండల కార్యదర్శి కురుమయ్య**



శివరాంపల్లి వద్ద భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు కుర్మయ్య

రాజేంద్రనగర్, జూలై16(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ఊర చెరువు వద్ద జలమండలి చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనుల ను సత్వరమే పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జి కురుమయ్య అధికారులను కోరారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శివరాంపల్లి ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జిఎం కురుమయ్య సిపిఎం నాయకులు ఎస్ మోహన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కురుమయ్య మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులు నత్త నడకన కొనసాగుతుండడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రహదారి గుండా శివరాంపల్లి నుండి వివిధ పనులకు వెళ్లే ప్రజలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని అయితే పైప్ లైన్ పనులు నత్త నడకన కొనసాగుతూ ఉండడం వల్ల గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలు ఇబ్బందుల గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కురుమయ్య కోరారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలి

**మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

నాగర్ కర్నూల్, జూలై16(ప్రభాత ఉదయం) మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివకుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ గా తీసుకరావడం కార్మిక హక్కులను కాలరాయడమే అని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు 26వేల రూపాయలు అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చెయ్యాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే ఆ కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులు 30 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, మున్సిపల్ కార్మికులు, మల్లేష్, ఆంజనేయులు, భాస్కర్, రాముడు, బాలస్వామి, నరసింహ కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ, జమదగ్ని కళ్యాణం





**భారీగా తరలివచ్చిన భక్తులు**

శంషాబాద్, జూలై 16( ప్రభాత ఉదయం) శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు.శంషాబాద్ మండలంలోని గన్సీమియా గూడ గ్రామం లో వెలిసిన అమ్మవారి ఆలయంలో ఆలయ పూజారులు గ్రామ ప్రముఖుల సమక్షంలో కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగ నిర్వహించారు. ఆలయ పూజారులు శ్రీశైలం. మల్లికార్జున్. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గుగ్గిళ్ళ రామనాథ ముదిరాజ్. స్థానిక మాజీ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్. మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుకమర్రి మహేందర్ ముదిరాజ్.తదితరుల సమక్షంలో అమ్మవారి కళ్యాణ వేడుకలను నిర్వహించారు. మండలంలోని పాలమాకుల పెద్ద షాపూర్. పెద్ద తూప్రా తండా. మదనపల్లి. శంకరపురం. గ్రామాలతో పాటు కొత్తూరు నందిగామ. షాద్ నగర్ తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. మంచిరేవుల గ్రామానికి చెందిన కృష్ణ భగవాన్ రెడ్డి భక్తులకు భోజన వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సారా కృష్ణ గౌడ్. బిజెపి నాయకులు చింతల నందకిషోర్. స్థానిక నాయకులు రవి గౌడ్. శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కనుమరుఘువుతున్న అప్పాచెరువు

## కబ్జాదారుల నుండి కాపాడాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి
## ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే చెరువు ఆక్రమణ
## బీజేవైఎం నాయకులు వినయ్ రెడ్డి



ఆక్రమణకు గురైన గగన్ పహాడ్ అప్పా చెరువు

రాజేంద్రనగర్, జూలై16(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ లో గల అప్పాచెరువు కబ్జాదారుల ఆక్రమణతో కనుమరుగవుతుందని బీజేవైఎం నాయకులు సూ రెడ్డి వినయ్ రెడ్డి అన్నారు. గగన్ పహాడ్ సర్వే నంబర్ లు 89,90,91,176,178 లలో అప్పాచెరువు 46 ఎకరాలు ఉందన్నారు. మంగళవారం చెరువు ను సందర్శించిన సూరెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. కబ్జాదారుల వల్ల చెరువు ఆక్రమణకు గురై నీటి నిలువ కు స్థలం లేకపోవడంతో వర్షాకాలంలో జాతీయ రహదారిపై వరద నీరు భారీగా చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ చెరువును అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించి అధికారులకు ఆక్రమణలను తొలగించి కబ్జాదారులు ను కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కానీ ఇప్పటివరకు ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మధ్యలో రైల్వే ట్రాక్ ఉందని ట్రాక్ కు ఆనుకొని మట్టి పోసి రైల్వే స్థలం సైతం కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. వర్షాకాలంలో చెరువు పరివాహక ప్రాంతం నుండి వచ్చే వరద నీరు చెరువులో మట్టి పోయడం వల్ల వెళ్లడానికి పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం చెరువు ఆక్రమణను తొలగించి సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం నాయకులు వినయ్ రెడ్డి రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులను కోరారు.



ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

# చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16(ప్రభాత ఉదయం)చివరి ఆయకట్ట వరకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ధరూర్ మండలం పరిధిలో ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా కుడికాలువకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమెహన్ రెడ్డి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వ్యవసాయానికి అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం వానకాలం కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమాయ్యారని, కావున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన సమయంలో నీటిని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు ప్రతి సన్నకారు రైతులకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎగువ భాగంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఐదారు రోజుల్లో జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుంటుందని, అనంతరం రిజర్వాయర్లు నింపుతామని పేర్కొన్నారు. రైతులు సమన్వయంతో నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి రామకృష్ణ నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్ విజయ్, భీమ్ రెడ్డి ప్రభాకర్ గౌడ్, డి.వై రామన్న, ఆనంద్ గౌడ, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి విజయ్ రెడ్డి, నాగన్న, రంగస్వామి, కురుమన్న, రాఘవేంద్ర రెడ్డి, శ్రీరాములు, ఆనంద్ రెడ్డి, ఆలీ సురేష్, గోవిందు, ధర్మ నాయుడు, సవారన్న పురుషోత్తం రెడ్డి సంతోష్, పూదూరు చిన్నయ్య, రాజు, ఈ.ఈ రహీముద్దీన్, నీటి పారుదల శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఇది చెరువు కాదు రోడ్డు మొయినాభాగం నుంచి చిలుకూరు వెళ్లే దారి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన రోడ్డు వేయని దుస్థితి

# చెరువును తలపిస్తున్న చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు

## రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి: బిజెపి నాయకులు గరుగురాజు ముదిరాజ్



మొయినాబాద్ జూలై 16 ( ప్రభాత ఉదయం ) మండలంలోని చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా మారిందని గ్రామస్తులకు చాలా ఇబ్బందిగా ఉందని బిజెపి నాయకుడు గరుగురాజు ముదిరాజ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... చెరువును తలపిస్తున్న చిలుకూరు నుంచి మొయినాబాద్ రోడ్డు కాలువ కాదు. మొయినాబాద్ నుంచి చిలు కూరు వెళ్లే రోడ్డు నమ్మశక్యంగా లేదు కదూ ఇది నిజంగా రోడ్డే. చిలుకూరు నుంచి మొయినాబాద్ సురంగల్ వరకు రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు కొంత దూరం రోడ్డు వేశారు చిలుకూరు నుంచి కొంత దూరం వరకు రోడ్డుకు వేశారు మధ్యలో కంకర పోసి వదిలేశారు వర్షం పడిందంటే చాలు రోడ్డుపై నీళ్లు నిలిచి వాహనదారులకు చిలుకూరు నుంచి గ్రామస్తులు డ్వాక్రా మహిళలు డబ్బులు బ్యాంకులో డబ్బులు కట్టేందుకు అంగడికి వెళ్లేందుకు ప్రతి పనికి మొయినాబాద్ వెళ్లాలంటే చాలా ఇబ్బందికి గురవుతున్నారు ప్రభుత్వం అధికారులు పట్టించుకోని తొందరగా చిలుకూరు నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు చేయించాలని వారు కోరుతున్నారు



# పిల్లలకు పోషకాహారం విధిగా అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు
## పోషకాహారంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16(ప్రభాత ఉదయం) మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేస్తూ ప్రజలతో మమేకమై "న్యూట్రిషన్ ఛాంపియన్స్ " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు సూచించారు.మంగళవారం ఐ.డి.ఓ.సి.లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసూతి శిశు చిన్న పిల్లల పోషణ , పిల్లలలో తీవ్రమైన పోషకాహార లోపం ,సమగ్ర నిర్వహణ పై జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...జిల్లాలోని (%వాూవీ,వీూవీ,వాఖజొ%) లోపం, పిల్లల పోషణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే ఇప్పటి వరకు కొంతమేర అభివృద్ధి జరిగిందని అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి లోప పోషణతో బాధ పడుతున్న పిల్లలను నార్మల్ స్తాయికి తీసుకురావాలని, అదేవిధంగా అనీమియాతో బాధ పడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గట్టు మండలం వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడింది కావున గట్టు మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఎంతో అవసరమని, అంగన్వాడి టీచర్, ఎ.ఎన్.ఎం ,ఆశ ముగ్గురు కలిపి కృషి చేస్తే లోప పోషణ తగ్గించవచ్చని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారు తీసుకున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. లోప పోషణతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు పరిశుభ్రతను పాటిస్తూ పిల్లలకు ఆహారం ఇవ్వాలని, ఆరోగ్య పరీక్షలు చేయించి ఎన్.ఆర్.సి. కి పంపేవిధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఓ. సుధారాణి, జడ్.పి.సి.ఇ.ఓ కాంతమ్మ. ప్రోగ్రాం ఆఫీసర్ డా. స్రవంతి, డా. రాజు, మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్, సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# బన్సీలాల్‌నగర్ బస్‌స్టాప్‌లో చైన్ స్నాచింగ్

బుద్వేల్, జూలై16(ప్రభాత ఉదయం):బుద్వేల్ బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో మంగళవారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి మూడు తులాల మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. బుద్వేల్ లో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నర్స్ గా పనిచేసే కిస్మత్ పూర్ కు చెందిన మమత(30) మంగళవారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళ్ళడానికి బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో నిలుచుంది. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోనుంచి మూడు తులాల బంగారు మంగళసూత్రం ను లాక్కొని పారిపోయారు. ఈ పెనుగులాట లో మమత క్రింద పడినా, వదలకుండా మంగళసూత్రం ను లాక్కొని వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్ ప్రహరీ దూకి పారిపోయారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో, డీఐ గంగాధర్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

### బన్సీలాల్ నగర్ బస్ స్టాప్‌లో తరచు చైన్ స్నాచింగ్ లు

బన్సీలాల్ నగర్ బస్ స్టాప్ లో తరచు చైన్ స్నాచింగ్ లు జరుగుతున్నాయి. సాయంత్రం వేళలలో డ్యూటీ లకు వెళ్లి వచ్చే మహిళలు బస్ దిగి వెళ్తున్న సమయంలో చైన్ స్నాచింగ్ చేసి వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ ప్రహరీ దూకి దుండగులు పారిపోతున్నారు.




# గద్వాల టౌన్ క్లబ్‌లో కుప్పకూలిన గోడలు

## భారీ వర్షాలకు నానిపోయిన గోడలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని గద్వాల టౌన్ క్లబ్ భవనం ఆవరణలో గల షటిల్ కోర్టు గోడ కూలిపోయింది. 1973 సంవత్సరంలో టౌన్ క్లబ్ భవన నిర్మాణం చేశారు. షటిల్ క్రీడాకారులు టౌన్ క్లబ్ ఆవరణలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం టౌన్ క్లబ్ లో అనేక మంది షటిల్ ఆడుతూ ఉంటారు. గతంలో భారీ వర్షాలకు టౌన్ క్లబ్ లోని షటిల్ కోర్టు దెబ్బతినడంతో అప్పటి నుంచి షటిల్ క్రీడాకారులు టౌన్ క్లబ్ లో ఆడటం మానేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు షటిల్ కోర్టు గోడలు నానిపోవడంతో పాటు మంగళవారం కురిసిన భారీ వర్షానికి గోడలు కూలిపోయాయి. దాంతో పాటు ఈదురుగాలులకు రేకులషెడ్డు ఊడిపోయి, కుప్పకూలాయి. పక్కనే ఉన్న ఇంటి మీద రాళ్లు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.



# బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద పూర్తి ఏర్పాట్లు చేయాలి

## కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి
## దేవాలయాల వద్ద సిసి,ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్,జులై16(ప్రభాత ఉదయం) బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంటెస్టెడ్ బిజెపి అభ్యర్థి, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో జరగబోయే బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్,మధుబన్ కాలనీ ప్రాంతాలలో అమ్మవారి దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... దేవాలయానికి కాలినడకన వచ్చే భక్తులకు,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చిప్స్, మట్టిని వేయాలని తెలిపారు.బోనాల వేడుకలు ప్రారంభవ నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బోనాల ఉత్సవాల దృష్ట్యా చేపట్టిన సిసి రోడ్డు,ప్యాచ్ వర్క్ పనులను త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు.పారిశుద్ధ్యం బాగుండాలని అధికారులకు ఆదేశించారు.రోడ్లు, డ్రైనేజీలు,వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బి జె పి నాయకులు సి బుచ్చిరెడ్డి, వెంకటరెడ్డి,గోవర్ధన్ రెడ్డి,రాజవర్ధన్ రెడ్డి,ఉత్తమ్,గోపి, శేఖర్,చందు నాయక్,రమేష్ రెడ్డి,గోపాల్ నాయక్, కుర్మయ్య చెన్నమ్మ,పాండు యాదవ్,తలారి చిన్న, శంకర్ రెడ్డి,శేఖర్,మసుదన్ రెడ్డి,మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.